క్లుప్తంగా

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



సి.బెళగల్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ

సి.బెళగల్‌: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్‌ శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు పండించిన కంది దిగుబడులను ఈ కేంద్రాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. 12 శాతం తేమ ఉండే కందులు క్వింటా రూ.7,550 ఉందని చెప్పారు. కేంద్రాల్లో కందులను అమ్మదలుచుకున్న రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు. కందుల కొనుగోలు అధికారి వీరయ్య, ఏఈఓ హిమబిందు, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

కోలుకోలేక యువకుడు మృతి



ఏసేపు (ఫైల్‌)

సి.బెళగల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యుడకుడు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల పరిధిలోని ఇనగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన ఏలియా, సిద్ధమ్మ దంపతుల రెండో కుమారుడు ఏసేపు (22) జనవరి 26వ తేదీ గుత్తికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా గోనెగండ్ల మండలం వీరంపల్లి స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. చేతికి వచ్చిన కుమారుడి మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



బూత్‌లెవల్‌ ఆఫీసర్లకు సూచనలు చేస్తున్న తహసీల్దార్‌

కర్నూలు(రూరల్‌): సచివాలయాల పరిధిలో ఓటర్ల జాబితాను పక్కాగా పరిశీలించాలని తహసీల్దార్‌ టీవీ రమేష్‌ బాబు అన్నారు. స్టాంటన్‌పురం, మామిదలపాడు, గీతాముఖర్జీ నగర్‌ సచివాలయల పరిధిలోని బూత్‌లెవల్‌ ఆఫీసర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఓటర్లు నివాసం ఉంటున్న ప్రాంతాలకు దగ్గరలోని పోలింగ్‌ బూత్‌లో వారికి ఓటు హక్కు ఉండేలా చూడాలని సూచించారు. కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్‌ బూత్‌ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా తయారు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కారును ఢీకొన్న అంబులెన్స్‌



దెబ్బతిన్న అంబులెన్స్‌

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద కారు(తుఫాన్‌)ను అంబులెన్స్‌ ఢీ కొంది. హైవే పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం తమ్మరాజుపల్లె నుంచి నంద్యాల వైపు వస్తున్న తుఫాన్‌ను వెనుక వస్తున్న అంబులెన్స్‌ ఢీకొందన్నారు. ఎవరికీ గాయాలు కాలేదన్నారు. హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ సమస్య రాకుండా చూశారు.

వధూవరులకు ఆశీర్వాదం

సి.బెళగల్‌: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి సర్పంచ్‌ దస్తగిరి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు కుమారుడు శివ వివాహం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేతలు నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం మాజీ కుడా చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ ఆదిమూలపు సతీష్‌ గ్రామానికి చేరుకుని పెళ్లి వేడుకలో పాలుపంచుకున్నారు. నూతన దంపతులు శివ, మల్లేశ్వరిని ఆశీర్వదించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహుడు, సోమశేఖర్‌ రెడ్డి, మహానంది, సి.బెళగల్‌, సంగాల సర్పంచ్‌లు పాండురంగన్న, హనుమంతు, మాజీ మార్కెట్‌ యార్డు డైరెక్టర్‌ ఎస్‌ఎం బాషా ఉన్నారు.

నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

పాణ్యం: మండల పరిధిలోని ప్రజా, రైతు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 10, 11 తేదీల్లో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శుక్రవారం దీక్షలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్‌) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌ కుమార్‌, సమాజ్‌వాదీ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివ కృష్ణ యాదవ్‌, ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వనం వెంకటాద్రి మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఎన్నో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవన్నారు. అలాగే రైతులకు ధాన్యం ఆరబెట్టుకోవడానికి మార్కెట్‌ యార్డ్‌ను పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్‌ చేశారు.



ఎన్‌.సుగాలితండా ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూడిపోయిన డ్రైనేజీ కాలువ



భూపాల్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త వద్ద పందుల సంచారం

చెత్త కుప్పలు.. ముప్పతిప్పలు

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- దృష్టి సారించని పంచాయతీ అధికారులు

కర్నూలు (రూరల్‌): స్వచ్ఛ భారత్‌ లక్ష్యం నెరవేరడం లేదు. పేరుకే స్వచ్ఛతా హీ సేవా.. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌... స్వచ్ఛ భారత్‌ నినాదం. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధం. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు పలుకుతున్నారు. పంచాయతీ అధికారుల అలసత్వం ప్రజలకు శాపంగా మారింది. రోడ్లపైనే చెత్తదిబ్బలు.. కాలువల నిండుగా మురుగు.. రోజుల తరబడి అలానే ఉండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. కడుపు తిప్పేస్తోం. దుర్గంధంతోనే సహజీవనం చేస్తూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు వ్యాప్తి చెందుతున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదు. ఇంతటి దుర్భర పరిస్థితి ఉన్నది ఎక్కడో కాదు. కర్నూలు నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉండే నందనపల్లె గ్రామ పంచాయతిలో. ఇక్కడ గిరిజనులు, దళితులే ఎక్కువగా నివసిస్తున్నారు. నగర శివార్లలో ఉండే గ్రామాల్లో పరిశుద్ధ్యం పనులు ఇలా ఉంటే.. మారుమూల గ్రామాల్లో పరిశుద్ధ్య పనులు ఎలా ఉంటాయో అధికారులకు తెలియాలి. నిర్వహణ కొరవడి గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది. గ్రామాల్లో స్వచ్ఛ భారత – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు అధికారులు రావడం..కొన్ని చోట్ల చెత్తను శుభ్రపరిచినట్లు ఫొటోలు దిగడం, వెళ్లిపోవడం జరుగుతోంది. కర్నూలు మండల పరిధిలోని నందనపల్లె, దిన్నెదేవరపాడు, ఈ.తాండ్రపాడు, జి.సింగవరం, ఆర్‌.కొంతలపాడు, పడిదెంపాడు, సుంకేసుల గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు సాఫీగా సాగడం లేదు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో రోజు కాలువల్లో పూడికతీత పనులు చేపడితే ఈ పరిస్థితి ఉండదని ప్రజలు అంటున్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట కనీసం బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి రోడ్లపైన ఉన్న చెత్తాచెదారాలను తొలగించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం



గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు నీరంతా ఇంటి ముందే నిలిచిపోయింది. దోమల బెడద ఎక్కువగా ఉంది. రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. గిరిజన, దళిత కుటుంబాలు నివసించే కాలనీలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువ మురుగుతో నిండిపోయింది. భక్తులు, గ్రామస్తులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

–యోగేష్‌ నాయక్‌, ఎన్‌.సుగాలితండా



గడివేముల–పెసరవాయి మార్గంలో ధ్వంసమైన రోడ్డు

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం

గడివేముల: మండల పరిధిలోని పలు రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ప్రయాణాలు ఇబ్బందిగా మారాయి. మండల కేంద్రమైన గడివేముల నుంచి పెసరవాయి వెళ్లే రహదారిలో భారీ గుంత ఏర్పడింది. నిత్యం నంద్యాల నుంచి కరిమద్దెల మీదుగా గడివేములకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెసరవాయి కేసీ కేనాల్‌ సమీపంలోని రహదారిలో భారీ వాహనాలు తిరగడంతో గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శాంతిరాంలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డీజీఎం ఉమామహేశ్వర రెడ్డి

పాణ్యం: మండలంలోని శాంతిరాం ఇంజినీరింగ్‌ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ×స్టార్ట్‌–అప్‌, క్రియేటివిటీ, ఇన్నోవేషన్‌ అండ్‌ బ్రెయిన్‌ స్టార్మింగ్‌ ఎట్‌ వర్క్‌ ప్లేస్‌× అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కలిపించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌ బీఈఎల్‌ డీజీఎం ఉమా మహేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయడం ఎంత ముఖ్యమన్నారు. పరిశోధనాత్మక దృక్పథం, నూతన ఆవిష్కరణలు పరిశ్రమల్లో ముందంజలో ఉండేందుకు తోడ్పాడతాయని పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌ విద్యార్థులకు సాంకేతికతతో పాటు సృజనాత్మక ఆలోచనా విధానం కలగడం అవసరమన్నారు. మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో ముందుకు సాగేందుకు ఏ విధమైన స్కిల్స్‌ అవసరమో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సుబ్రమణ్యం, సౌమ్య పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్‌ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం దూపాడు సమీపంలోని కళాశాలలో కర్నూలు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువ ఉత్సవ్‌ 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో విద్యార్థులు, యువత పోటీతత్వంతో మెలగాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర సమన్వయకర్త రాహుల్‌ గిరిరెడ్డి మాట్లాడుతూ.. యువతీ, యువకులు సమయం సద్వినియోగం చేసుకుని లక్ష్యం వైపు ప్రయాణం చేయాలన్నారు. అనంతరం వ్యాస రచన పోటీలు, సైన్స్‌ మేళా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాయి ప్రదీప్‌, నాగేష్‌, బద్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లడుతున్న ఏపీఓ

వలసల నివారణకే ఉపాధి పనులు

కర్నూలు (రూరల్‌): వలసల నివారణకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మధుబాబు అన్నారు. ఉల్చాల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం కూలి పనులు చేస్తే రూ.300 వరకు వేతనం వస్తుందని తెలిపారు. మార్చి 31వ తేదీకి 100 రోజుల పనిదినాల గడువు ముగుస్తుందని.. ఆలోగా కూలీలంతా వారి పని దినాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. 50 మంది కలిసి ఒక శ్రమశక్తి సంఘంగా ఏడ్పడితే అందులో ఒకరిని మేటీగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వలసలు పోకుండా అందరూ ఉపాధి హామీ పథకం పనులకు రావాలని కోరారు. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో పనుల ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మండలాభివృద్ధికి చర్యలు తీసుకోండి

- మండల మీట్‌లో ఎంపీపీ బొంతల మునెప్ప
- అధికారుల తీరుపై మండిపడ్డ సభ్యులు



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్‌: మండల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల మండల అధికారులు తమ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, చేపడుతున్న పనులను సభలో చదివి వినిపించారు. చెరువులు, పంట కాలువల మరమ్మతులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సాగునీటి సరఫరా విషయంలో ఇరిగేషన్‌ (ఐడీసీ) అధికారుల తీరుపై కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే సంబంధిత అధికారులు ఎలాంటి అనుమతి లేకుండా వెళ్లిపోవడంపై సభ్యులు, ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

- రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్న రైతులు ప్రీమియం చెల్లించి పంట బీమా నమోదు చేసుకోవాలని ఏఓ మల్లేష్‌ కుమార్‌ అన్నారు.
- పశు వైద్య శిబిరాల ద్వారా పశువులకు టీకాలు వేయించామని, గోకులం షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు సకాలంలో పూర్తి చేసుకోవాలని పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్‌ పర్కొన్నారు.
- సీసీ రోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రాధాన్యత పనులుగా చేపట్టడం జరుగుతుందని పీఆర్‌ ఏఈ వెంకట ప్రకాష్‌, జల్‌ జీవన్‌ మిషన్‌లో చేపట్టే పనులకు టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ గోసేనాయక్‌ కోరారు.
- మండలంలో పొదుపు మహిళలకు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెలుగు ఏపీఎం రామేశ్వర్‌ తెలిపారు.
- ఉపాధిహామీ పథకంలో అవసరమైన వారందరికీ పనులు కల్పిస్తామని ఏపీడీ అల్లిపీర, ఏపీఓ రామన్న అన్నారు.

ధ్రువీకరణ పత్రాలపై రగడ



జనన, మరణ ధృవీకరణ పత్రాలపై వాదులాడుతున్న ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ పురుషోత్తం, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి

సభలో రీసర్వే అంశాలు, రెవెన్యూ సేవలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీపై ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ పురుషోత్తం వివరిస్తూ, ధృవపత్రాల జారీపై పంచాయతీ కార్యదర్శుల తీరుపై మండిపడ్డారు. ఈ విషయంపై కలుగజేసుకున్న ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి ఆలస్యంగా నమోదయ్యే మరణ, జనన ధృవపత్రాలను అర్జీదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటారని, అందులో పంచాయతీ కార్యదర్శులు వివరాలను నమోదు చేసే అవకాశం ఉండదని వాదనకు దిగారు. రెండు శాఖల అధికారులు ధృవీకరణ పత్రాల జారీ అంశాలపై జరిగిన రగడపై పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. రైతుల భూములు ఆన్‌లైన్‌ నుంచి తొలగిస్తున్నారని, భూముల ఆన్‌లైన్‌ కోసం అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఎంపీపీ మండిపడ్డారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమల్లో అధికారులు అలసత్వం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో అధికారులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కనీస వేతనం వచ్చేలా చూడాలని ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ముందుగా ఫీడర్‌ చానెల్‌లో పూడికతీత పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలు కనీస వేతనం వచ్చేలా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ కుమార్‌ సాయినాథ్‌, క్షేత్రస్థాయి సహాయకులు ఉన్నారు.

గరిష్ట వేతనం రూ.300 వచ్చేలా పనులు

సి.బెళగల్‌: ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పనులను కూలీలు కొలతల ప్రకారం చేపడితే రోజువారి గరిష్ట వేతనం రూ.300 పొందవచ్చని ఏపీడీ అల్లిపీర అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో ఉపధిహామీ పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడుతూ.. సమయపాలన పాటించి, కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం సి.బెళగల్‌ ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ పనులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని తెలిపారు. ఏపీఓ రామన్న, ఉపాధిహామీ ఏఈ రంగస్వామి, వితేంద్ర రెడ్డి, టీఏలు, ఎఫ్‌ఏలు, మేటీలు ఉన్నారు.



కాడెద్దుల సాయంతో విత్తనాలు వేస్తున్న రైతన్న



పొలాల్లో సందడి చేస్తున్న కొంగలు

జోరుగా ఆరుతడి పంటల సాగు

రబీ సీజన్‌కు గాజులదిన్నె ప్రాజెక్టు

ఎడమ కాల్వ కింద ఆయకట్టు భూముల్లో రైతులు జోరుగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఇరిగేషన్‌ అధికారులు ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సుమారు 4 వేలకు పైగా ఎకరాలకు సాగు నీరందించేందుకు ఆయకట్టు స్థిరీకరించారు. దీంతో రైతులు ఆరుతడి పంటలుగా మొక్కజొన్న, కొర్ర వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు రైతులు కాడెద్దులతో విత్తనాలను వేస్తుండగా, మరికొందరు రైతులు పొలాలకు నీటి తడులు కట్టే పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. కాగా రైతులు పొలాలకు నీటి తడులు కడుతుండగా రైతు నేస్తాలైన కొంగలు భారీగా వాలిపోతూ సందడి చేస్తున్నాయి. నీళ్లు కట్టే క్రమంలో భూమిలో నుంచి వచ్చే కీటకాలను తింటూ రైతన్నకు మేలును చేకూరుస్తున్నాయి.

– కోడుమూరు రూరల్‌

వైఎస్సార్‌సీపీ ఫీజు పోరును

విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఫీజు పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

కల్లూరు: విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈనెల 5న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తన స్వగృహంలో ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని.. మాట్లాడుతూ ఫీజు పోరులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలసి నంద్యాలలోని ఉదయానంద హోటల్‌ నుంచి కలెక్టర్‌ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రమందిస్తామన్నారు. విద్యార్థులు, నంద్యాల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌, వసతి దీవెన కింద రూ. 3,900 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కోర్సులు పూర్తయిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రాకపోడంతో విద్యార్థులు చదువులు కొనసాగించలేక, పనులకు వెళ్తున్నారన్నారు.

మాట తప్పడం చంద్రబాబు నైజం

సుదీర్ఘ అనుభం ఉన్న రాజకీయ నాయకుడిని అని, సంపద సృష్టిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారని కాటసాని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. 'సూపర్‌ సిక్స్‌' పేరుతో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 'కూటమి' నాయకులందరూ అప్పటి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పలేదా అని కాటసాని ప్రశ్నించారు. సూపర్‌ సిక్స్‌ పథకాలు అందిస్తామని ప్రజలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పడం సిగ్గుగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే చొక్కాలు పట్టుకోమని చెప్పిన నేతలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, ఈశ్వరయ్య, రామకృష్ణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు యాదవ్‌, మద్దిలేటి, తిరుపాల్‌ పాల్గొన్నారు.